తన కుటుంబాన్ని
నాశనం చేసిన
ఆ నిర్మాతపై
అతనెలా
పగ సాధించాడు?

**ఇసుకపట్ల ఇజ్రాయెల్ కధ**

# పగ

"షాట్ రెడీ..." అసిస్టెంట్ డైరెక్టర్ అరిచాడు. బయట ప్రతికా విలేకర్లతో మాట్లాడుతున్న శ్రీమంత్ కుర్చీలోనుంచి లేచి సెట్లోకి వచ్చాడు.

లోపలవేసిన సెట్ చాలా అందంగా ఉంది. పెద్దభవంతిలో ఒక భాగం అది. ఖరీదైన కుర్చీలు, సోఫాలు ఓ ప్రక్కగా వేశారు.

కెమెరామెన్ కెమెరాదగ్గర రెడీగా ఉన్నాడు. చెప్పవలసిన మాటలు, ఇవ్వవలసిన సూచనలు మరోసారి గుర్తుచేశాడు డైరెక్టర్ వర్మ.

"స్టార్ట్ కెమెరా! స్టార్ట్ యాక్షన్!" కెమెరామెన్‌కి హీరోకి ఒకేసారి అనుమతి ఇచ్చాడు వర్మ.

కెమెరాలోని ఫిల్మ్ మెమ్మదిగా తిరుగుతోంది.

"అమ్మా! అంత మాటనకమ్మా... ప్రేమించుకున్న హృదయాలని విడదీసి పాపం మూట కట్టుకోవద్దమ్మా..." బాధగా తల్లితో అన్నాడు రమేష్.

"రమేష్! నేను చేస్తున్న పని పాపమో, పుణ్యమో నాకు బాగా తెలుసు. ఏమైనాసరే ఆ కులం తక్కువదాన్ని పెళ్ళి చేసుకుంటానంటే మాత్రం నేనూరుకోను..." ఆమె మాటల్లో కోపం ధ్వనించింది.

"అమ్మా... అంతేనంటావా... కన్నకొడుకు మనసుని అర్థం చేసుకోకుండా ఇలాగేనమ్మా చెప్పేది..." మరింత బాధగా అన్నాడు రమేష్.

"నోరుమూసుకో. కన్నతల్లినైన నేను చూసిన సంబంధాన్ని చేసుకోకుండా... కోరి



పిల్లనిస్తామని వచ్చినవాళ్ళని అవమానపరచి, చివరికి ఆ ముండని ప్రేమించానని వెంటపడుతున్నావా? నీకసలు బుద్ధి, జ్ఞానం, సిగ్గు అనేవి వున్నాయా? ఏమైనాసరే, నా నిర్ణయం ప్రకారం జరుగవలసిందే..." ఆజ్ఞాపిస్తున్నట్లు అంది తల్లి.

"నాతో సంప్రదించకుండా ఈ సంబంధాన్ని ఖాయం చెయ్యమని ఎవరు చెప్పార

మ్మా నీకు...'' విసుగ్గా అన్నాడు రమేష్.

''నీతో చెప్పి చెయ్యాలా? నాతో ఒక్కసారికూడా దాన్ని ప్రేమించినట్టు ఎందుకు చెప్పలేదు. మన కులం ఏమిటి? దాని కులం ఏమిటి? మన అంతస్తు ఎక్కడ? దాని అంతస్తు ఎక్కడ? మనం వాడేసిన ఎంగిలికూడు తిని బతికే అది ఈ ఇంటి కోడలవుతుందని కలలో కూడా అనుకోవద్దు. దాన్ని పూర్తిగా మర్చిపోవాలి. వెంటనే నేను చూసిన సంబంధం చేసుకోక తప్పదు...'' అంది దృఢంగా తల్లి.

''అమ్మా!...'' గట్టిగా అరిచాడు రమేష్

''ఏం! ఎందుకలా అరుస్తావు...''

''క్షమించమ్మా. ఈ పెళ్ళి చేసుకోవడం నాకు ఇష్టం లేదు...''

''నేను చూసిన సంబంధాన్ని చేసుకోవడం నీకు ఇష్టం లేదా? చివరిసారిగా చెప్తున్నాను. కన్నతల్లి కావాలో... ప్రేమించిన అమ్మాయి కావాలో వెంటనే తేల్చుకో...'' అంది ఆఖరి అస్త్రాన్ని ప్రయోగిస్తూ.

''అమ్మా... అంత మాట అనవద్దు. జన్మనిచ్చి పెద్దచేసి ఇంతటివాడిని చేసిన మాతృమూర్తిని వదులుకోలేనమ్మా...''

''అయితే నేను చూసిన సంబంధం చేసుకుంటావా?''

''చేసుకోను... చేసుకోలేను. ఇటు మాతృమూర్తి ప్రేమ, అటు ప్రేమమూర్తి ప్రేమ కావాలి. ఈ ఇద్దరిలో ఎవరు దూరమైనా ఈ రమేష్ బతకడమ్మా...'' విసురుగా గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకున్నాడు రమేష్.

ఊహించని ఆ పరిస్థితికి మ్రాన్పడిపోయింది ఆమె. ''బాబూ...'' ఆ తల్లి కళ్ళు నీళ్ళతో నిండుకున్నాయి.

కట్... కట్... డైరెక్టర్ ఆదేశంతో కెమెరా ఆగిపోయింది.

రమేష్‌గా శ్రీమంత్, అతని తల్లిగా అన్నపూర్ణ నటించిన ఆ సన్నివేశం ప్రేమజ్యోతి చిత్రంలోనిది. ఆ సన్నివేశం పూర్తికాగానే అంతా సెట్ బయటకు వచ్చారు.

మళ్ళీ శ్రీమంత్ చుట్టూ విలేకర్లు మూగారు.

''ఇప్పుడు మీరు నటిస్తున్న 'ప్రేమజ్యోతి' చిత్రం ఎంతవరకు పూర్తి అయింది. ఎప్పుడు రిలీజ్ అవుతుంది?'' అంటూ అడిగాడు ఓ విలేకరి.

''ప్రేమజ్యోతి మూడువంతులకు పైగా పూర్తయ్యింది. బహుశా అన్ని కార్యక్రమాలు పూర్తిచేసుకుని ఓ నెల రోజుల్లో విడుదల కావచ్చు...'' చెప్పాడు శ్రీమంత్.

''మీరు నటిస్తున్న చిత్రాల గురించి చెపుతారా?'' ఇంకో విలేకరి అడిగాడు శ్రీమంత్‌ని.

''అంగీకరించిన చిత్రాలు చాలా ఉన్నాయి. వాటిలో కొన్నింటికి ఇంకా పేర్లు ఏమీ నిర్ణయించలేదు. అంతర్జాతీయ గూఢచారులు, వజ్రాలదీపం, రాబందుల రాజ్యంలో రామచిలుకల పోరాటం మున్నగు చిత్రాల పేర్లు నిర్ణయించినవి. ఇవన్నీ మంచి వెరయిటీ కథగల చిత్రాలు...'' జవాబిచ్చాడు శ్రీమంత్.

''థాంక్స్... మెనీ... మెనీ థాంక్స్...'' అంటూ మరో ఫ్లోర్‌వైపు వెళ్ళిపోయారంతా

విలేకర్లు.

''ఈ పిక్చర్ వారం రోజుల్లో పూర్తయి పోతుంది. ఇంకా కొద్దిపాటి పాచ్‌వర్కు మాత్రమే మిగిలివుంటుంది. మీరు అందించిన సహాయ సహకారాలకు నా థాంక్స్...'' అంటూ చెప్పాడు డైరెక్టర్ వర్మ శ్రీమంత్‌ని ఉద్దేశిస్తూ.

నవ్వుతూ కారు ఎక్కాడు శ్రీమంత్. ఇంటివైపు మళ్ళించాడు కారుని.

ముచ్చటైన మూడంతస్తుల భవనం అది. సూర్యకాంతిలో తెలుపురంగు మరింతగా ప్రకాశిస్తుంది.

వరండానుంచి ప్రహరీగోడ వరకు గార్డెన్ వ్యాపించి ఉంది. రకరకాల చెట్లు ఊగుతూ స్వాగతం చెప్తున్నట్టున్నాయి. వాటికి అలంకారాలుగా పువ్వులు వింత ఆకర్షణ కలిగిస్తున్నాయి.

కుడిచేతివైపు పోర్టికోలో ఉంది. గార్డెన్ మధ్యన పాలరాతితో మలచిన బుద్ధుని విగ్రహం ఉంది. ఇవన్నీ కలిసి ఆ భవనానికి మరింత శోభని కలిగిస్తున్నాయి.


పోర్టికోలో కారుని ఆపి లోపలికి వచ్చాడు శ్రీమంత్. అతనికోసమే కాచుక్కూర్చున్నట్టు డ్రాయింగ్ రూమ్‌లో కొంతమంది యువకులు శ్రీమంత్‌ని చూడగానే లేచి నిలబడ్డారు.

''కూర్చోండి. కాఫీ తీసుకున్నారా? మీరు వచ్చిన పని?'' అంటూ ఆప్యాయంగా అడిగేడు శ్రీమంత్ ఆ యువకుల్ని.

''కాఫీ తీసుకున్నామండి. మేము తుఫాన్ బాధితుల సహాయానికి ఇంటింటికి తిరుగుతున్నాము. మీకు తోచిన సహాయం చెయ్యండి'' అన్నాడు వాళ్ళల్లో ఒకరు.

''మీరు చేస్తున్న మంచి పనికి నా అభినందనలు. ఇదిగో ఈ చెక్కు తీసుకోండి...'' అంటూ రెండు లక్షలకు చెక్కు వ్రాసిచ్చాడు శ్రీమంత్.

శ్రీమంత్‌కు కృతజ్ఞతలు చెప్పి వెళ్ళిపోయారు ఆ యువకులు. వాళ్ళు వెళ్ళినవైపే



చూస్తూ చిన్నగా నిట్టూర్పు విడిచి లోనికి నడిచాడు శ్రీమంత్.

లోపల సెక్రటరీ సురేష్ ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు.

"ఆ... అలాగేనండి. వచ్చిన వెంటనే చెపుతాను. మర్చిపోను. తప్పకుండా చెపుతాను..." అంటూ రిసీవర్ పెట్టేశాడు.

"ఎవరు సురేష్ మాట్లాడింది!" అడిగాడు శ్రీమంత్.

"సార్! హోటల్ తాజ్‌లో రేపు సాయంకాలం హాజరుకమ్మని నిర్మాతల సంఘం నుంచి ఫోనొచ్చింది. మీతో చెప్పమన్నారు" చెప్పాడు సురేష్.

"అలాగే!" అంటూ డ్రెస్ ఛేంజ్ చేసుకోవడానికి లోనికి వెళ్ళాడు శ్రీమంత్.

భోజనం చేసి, కుర్చీలో కూర్చుని పేపరు చూస్తూ ఆలోచించసాగాడు శ్రీమంత్.

శ్రీమంత్ సినీఫీల్డులోకి రాకముందు మదన్ మంచి బిజీ నటుడిగా పేరుపొందాడు. శ్రీమంత్‌ని దర్శకుడు నిత్యారావు సినీఫీల్డుకి పరిచయం చేశాడు. తక్కువ కాలంలోనే ఎన్నో చిత్రాల్లో ఎందరో తారలతో నటించాడు. మదన్‌కు గుండెపోటు వచ్చి చనిపోయాడు. ఆ తరువాత శ్రీమంత్ బిజీ నటుడుగా అయిపోయాడు. మార్కెట్ బ్రహ్మాండంగా ఉంది. ఎంత అడిగితే అంత ఇవ్వడానికి నిర్మాతలు సిద్ధంగా ఉండేవారు.

ఎన్నో చిత్రాలు హిట్, సూపర్ హిట్ అయ్యాయి. ఎన్నో అభిమాన సంఘాలు ఉన్నాయి. ఎందరికో అభిమాన నటుడు అయ్యాడు. తను కథ బాగుంటేనే ఒప్పుకుంటాడు. లేకపోతే లేదు. తనకు చెడ్డపేరు వస్తుందని కాదు. నిర్మాతలని చూసి జాలిపడేవాడు. డబ్బుకోసం పెద్దపెద్ద తారలతో భారీఎత్తున సినిమా తీసి బాక్సాఫీసువద్ద బోల్తాకొట్టినవాళ్ళు ఎంతోమంది ఉన్నారు. డబ్బు లేకపోయినా అప్పుచేసి, ఉన్నదంతా అమ్మేసి ఎలా అయితేనే పిక్చర్ తీసి ఘోర పరాజయం పొందిన నిర్మాతలు అతనికి తెలుసు. అందుకే ముందు కథకే ప్రాధాన్యం ఇస్తాడు. లేకపోతే లేదు. శ్రీమంత్ సలహా పాటించి దండిగా లాభాలు పొందినవారు లేకపోలేదు. నిర్మాతలనుండి, ప్రజలనుండి 'అపజయమెరుగని నటుడు' అని బిరుదును కూడా అందుకున్నాడు. ప్రతి నిర్మాత కూడా అతనితో పిక్చర్ తియ్యాలని పోటీపడేవాళ్ళే. అతడితోపాటు కొత్తవారికి కూడా అవకాశాలు కల్పించేవాడు.

శ్రీమంత్‌కి ఇంకా పెళ్ళికాలేదు. వయస్సు ముప్పై అయిదుసంవత్సరాలు దాటుతోంది. అయినా అతడికి పెళ్ళిమీద దృష్టి ఇంకా పోలేదు. డబ్బుని తన ఖర్చుల కోసం కొద్దిగా ఇంట్లోనే పెట్టుకుని, మిగతాది బ్యాంకులో వేసేవాడు. సహాయ కార్యక్రమాల కోసం విరాళాలు ఇచ్చేవారి లిస్టులో శ్రీమంత్ పేరు ఎప్పుడూ ముందే ఉంటుంది.

ఎన్నో సంస్థలకి, ఎందరికో జీవనోపాధి కోసం, విద్యా సంస్థలకి, వైద్యాలయాలకి ఎంతెంతో ఉదారంగా విరాళాలు ఇచ్చేవాడు. ఇటు నిర్మాతల్లోను, అటు ప్రేక్షకుల్లోను

ఎంతో మంచి పేరు ఉంది...

ట్రింగ్... ట్రింగ్... ట్రింగ్...

నిశ్శబ్దాన్ని చీలుస్తూ ఫోను మ్రోగింది.

"సార్! ఫోనొచ్చింది!" చెప్పాడు సురేష్.

"ఎక్కడనుంచి..." అడిగాడు శ్రీమంత్.

"బలరామ్ పిక్చర్స్‌నుంచి సార్..."

అంతవరకూ మామూలుగా ఉన్న శ్రీమంత్ గంభీరంగా మారిపోయాడు. మొహంలో రంగులు కూడా మారిపోయాయి.

"బ..ల..రా..మ్..." అప్రయత్నంగా అన్నాడు.

"అవునుసార్! బలరామ్‌గారి దగ్గరనుండి..." అంటూ రిసీవర్ శ్రీమంత్‌కి అందించాడు సురేష్.

"హల్లో..." పళ్ళు బిగువనుంచి పలికాడు.

"హల్లో... ఎవరు! శ్రీమంత్‌గారేనా?" అవతలనుండి బలరామ్ కంఠం వినిపించింది.

"ఎస్.."

"నేను బలరామ్‌ని... మీరిచ్చిన కాల్‌షీట్స్ రేపటినుండి ప్రారంభం... రేపు ఉథయం తొమ్మిది గంటలకు సర్కార్ స్టూడియోకు రండి. మళ్ళీ ఫోన్ చేస్తాను. ఓకే... బెస్టాఫ్ గుడ్‌లక్...

......................

"సార్! అవతల ఫోన్ పెట్టేసినట్టున్నారు. ఇంకా రిసీవర్‌ని చెవిదగ్గరే ఉంచుకున్న శ్రీమంత్‌తో అన్నాడు సురేష్.

"ఆ...' అంటూ రిసీవర్ సురేష్ చేతికి అందించాడు.

బలరామ్‌నుంచి ఫోన్ వచ్చిన తర్వాత శ్రీమంత్ అదోలా మారిపోవడం గమనించాడు సురేష్.

ఒక్కసారికాదు, రెండుసార్లు కాదు చాలాసార్లు అంతే అసలు బలరామ్ పేరు వినిపిస్తే చాలు అంతవరకు మామూలుగా ఉండే మనిషి టక్కున మారిపోతాడు.



## నయం

అప్పుడే క్యాంపునుండి వచ్చిన అయోమయం సుబ్బారావు తన ఇల్లేననుకుని పక్కింటిలోకి దూరాడు.

"అయ్యో ఇది మీ ఇల్లు కాదండీ?" అంది పక్కింటి ఇల్లాలు గాభరాగా.

"పొరపాటున మా ఇల్లనుకుని వచ్చాను క్షమించండి...'

"పర్వాలేదులెండి. మా ఆయనకంటే మీరే నయం. రాత్రివగా మీ ఇంట్లోకెళ్ళి ఇంకా రాలేదా మహానుభావుడు"

—తూమాటి చైతన్య (హైదరాబాద్)

ఇదేమీ సురేష్‌కి అర్థం కావడం లేదు.

ప్రతీ నిర్మాతతోను ఎంతో ఆదరంగా, ఆప్యాయంగా మాట్లాడే శ్రీమంత్ ఒక్క బలరావ్ విషయంలో సీరియస్ అయిపోవడం ఎందుకో... చాలా విచిత్రంగా వుంది. పోనీ తగాదాలా అంటే అవేం లేవు. ఒకరకంగా అజాత శత్రువుగా పేరుంది శ్రీమంత్‌కి.

తొమ్మిదింటికి పాలు తీసుకెళ్ళాడు సురేష్. మంచంమీద వెలికిలా పడుకుని పైన తిరుగుతున్న ఫాన్ వంక తదేకంగా చూస్తున్నాడు శ్రీమంత్.

"మిల్క్ సార్!" నెమ్మదిగా పిలిచాడు సురేష్.

"సురేష్... ఇప్పుడేమీ వద్దు తీసుకుపో..." తల తిప్పకుండానే సమాధానం ఇచ్చాడు శ్రీమంత్. అయినా అలాగే నిలబడ్డాడు సురేష్ వెళ్ళకుండా.

కొద్దిసేపటికి సురేష్‌వైపు చూశాడు శ్రీమంత్.

"ఏమిటి సురేష్! ఏమైనా అడగాలా?"

"అవునుసార్! ఎప్పటినుంచో అడగాలనుకుంటున్నాను. కానీ...." అంటూ మధ్యలోనే ఆగిపోయాడు సురేష్.

"మరింత ఆలస్యం చేశావెందుకు!" శ్రీమంత్ అన్నాడు.

"సమయం, సందర్భం రాకసార్..."

"ఏమిటీ... డబ్బేమన్నా కావాలా?"

"నో...నో...సార్ డబ్బుకాదు. నేను అడిగినదానికి మీరు సూటిగా సమాధానం చెపుతానని ప్రామిస్ చెయ్యండి సార్..." అంటూ కుడిచెయ్యిని ముందుకు చాపేడు సురేష్.

"ఏమిటి సురేష్! ఈరోజు నీ ధోరణి కొత్తగా కనిపిస్తుంది. అలాగే ప్రామిస్" అంటూ చేతిలోచెయ్యి వేశాడు శ్రీమంత్.

"సార్! మీరు బలరావ్‌గారి పేరు వినగానే అదోలా అయిపోతారు. ఎందుకుసార్? ఇదివరకు ఆయన చిత్రాల్లో నటించేటప్పుడు కూడా అలాగే ఉండేవారు. మిగతా నిర్మాతలతో ఒకలా, బలరావ్‌గారితో మరోలా మాట్లాడతారెందుకుసార్... నాకేమీ అర్థం కావడం లేదు సార్..." సంశయం వెలిబుచ్చాడు సురేష్.

"సురేష్! ఒక చిత్రంలో నటించేటప్పుడు గుండెల్లో బాధ లేకపోయినా బాధ ఉన్నట్టు నటించాలి. అది సినిమా జీవితం. నా నిజ జీవితంలో నిజంగానే అగ్నిజ్వాలలు మండుతున్నాయి. దానికి కారణం ఎవరో తెలుసా?" ఆవేశంగా అన్నాడు శ్రీమంత్.

"ఎవరుసార్" ఆతృతతో అడిగాడు సురేష్.

"బలరావ్, సురేష్... బలరావ్..."

"బలరామా సార్..." ఆశ్చర్యపోతూ అడిగాడు సురేష్.

"అవును బలరామే. విందుకుండలా ఉన్న మా కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసింది బలరావ్. మా అక్క పెళ్ళి చెడిపోవడానికి కారకుడు బలరావ్, నా అన్న చావుకి కారకుడు బలరావ్, నా తల్లిదండ్రులు చనిపోవడానికి కారకుడు బలరావ్... నేను

ఏకాకిగా మిగలడానికి కూడా బలరామే కారకుడు...'' ఆవేశంగా అన్నాడు శ్రీమంత్.

''సార్! సరిగ్గా చెప్పండి. నాకేమీ అర్థం కావడం లేదు. బలరావ్ మీ కుటుంబానికి ద్రోహం చేశాడా?'' అడిగాడు సురేష్ ఆశ్చర్యపోతూ.

''మా కుటుంబానికే కాదు సురేష్. కొన్నివందల కుటుంబాలకు తీరని ద్రోహం చేసి లక్షలు సంపాదించి, మేడలు, మిద్దెలు కట్టుకున్నాడు. నేను సినీ ఫీల్డులోనికి వచ్చింది, దేనికోసమనుకున్నావు... నటించి పేరు ప్రతిష్ఠలు, డబ్బు సంపాదించడానికి కాదు, పగ తీర్చుకోవడానికి...'' చెప్పాడు శ్రీమంత్.

''ప...గ...'' ఆందోళనగా అడిగాడు సురేష్.

''అవును పగే! బలరావ్‌ని సమూలంగా నాశనం చేస్తేనేగాని, నాలో మండుతున్న అగ్నిగుండం ఆరదు. బలరావ్‌మీద పగ ఉండటానికి గల కారణం చెపుతాను. అలా కూర్చో...'' అంటూ సోఫా చూపించాడు శ్రీమంత్.

''అలాగే సార్!'' అంటూ సోఫాలో కూర్చున్నాడు సురేష్.

* * *

మాది మధ్యతరగతి కుటుంబం. ఆస్తి మూడు ఎకరాల పొలం తప్ప మరో చిల్లిగవ్వ కూడా లేదు. మా వంశంలో అంతా వ్యవసాయదారులే. మా అమ్మ, నాన్నకి ముగ్గురు సంతానం. మొదట మా అక్కయ్య, రెండోవాడు మా అన్నయ్య నరేంద్ర, మూడవ వాడిని నేను. నాకు, నరేంద్రకి ఒక సంవత్సరం తేడా మాత్రమే.

మేము ఇంకా చిన్నపిల్లలమని మా నాన్న పొలం పనులు నేర్పకుండా బడిలో చేర్పించాడు. మా నరేంద్రకి చిన్నప్పటినుండి నాటకాలంటే తగని పిచ్చి. నాటకం ఫలానా వూళ్ళో వేస్తున్నారని తెలిస్తే చాలు, ఎంత దూరమైనా సరే వెళ్ళి చూసివచ్చేవాడు.

## ప్లీజ్... నో



నేను తొమ్మిది నెలలు మోసి కనకపోయినా 'అమిత్' నా కొడుకే.

తల్లికీ కొడుక్కీ మధ్య అక్రమ సంబంధం అంటగట్టడం ఎంతో దురదృష్టకరం.

అమిత్‌నే పెళ్ళిచేసుకోవాలనుకుంటే కిషోర్‌కుమార్‌ని నేను పెళ్ళి చేసుకునేదాన్ని కాదు.

నచ్చిన పిల్లను పెళ్ళిచేసుకోమని అమిత్‌కి చెబితే నా మీదే విరుచుకుపడ్డాడు.

నేను కిషోర్‌కుమార్ భార్యగానే చివరి శ్వాస వదలాలనుకుంటున్నాను. నా కొడుకు భవిష్యత్తే నా సర్వస్వం.

లీనా చందావర్కర్ మనసు విప్పిచెప్పిన మాటలు.

—వింజమూరి కృష్ణమూర్తి

లేకపోతే వాడికి నిద్రపట్టేది కాదు. నాటకాలు చూడటంలో ఎంత ఆసక్తి చూపేవాడో నాటకాలు వెయ్యడంలో కూడా అంతే ఆసక్తి చూపేవాడు.

అందంగా సినిమా యాక్టర్‌లా వున్నావు రా! అంటే చాలు ఎంతో పొంగిపోయేవాడు. నిజానికి మా నరేంద్ర చాలా అందంగా ఉండేవాడు. వాడు పదవ తరగతిలో వుండగా, నేను తొమ్మిదవ తరగతి. అప్పుడు ఓసారి స్కూల్ ఫంక్షన్ జరిగింది. నాటకాల పోటీ పెట్టారు. మా అన్నయ్య సత్యహరిశ్చంద్రుడిగా వేసి బహుమతి పొందాడు. అన్నయ్య నటనను చూసిన కొంతమంది పెద్దవాళ్ళు మెచ్చుకొని, సినిమాలో చేరు. బాగా రాణిస్తావు అన్నారు సరదాగా. ఆ మాట నిజమే అనుకున్నాడు మా నరేంద్ర.

పదవ తరగతి పరీక్షలు అయిన తర్వాత తోటి వాళ్ళందరని కూడగట్టుకుని మా వీధి అరుగుమీద నాటకాలు వేసేవాడు. నాకు ఇష్టం లేకపోయినా వాడి బలవంతంమీద నేనుకూడా ఏదో ఒక పాత్ర వేసేవాడిని. చాలాసార్లు అమ్మ, నాన్నలతో చివాట్లు, దెబ్బలు తిన్నాడు. అయినా వాడికి నాటకాల పిచ్చి వదలలేదు. వీడికి రానురాను నాటకాల పిచ్చి ముదిరిపోతుందని మా నాన్నగారు బాధపడుతూ వుండేవారు.

ఇలా రోజులు జరిగిపోతున్నాయి.

ఆరోజు...

అప్పటినుంచే శని మొదలయింది.

అనుకోకుండా మా నరేంద్ర ఓ సినిమా ప్రకటన పత్రికలో చూశాడు. కొత్త నటీనటులు కావలెను. అందంగా ఉండి, నాటకానుభవం వున్నవారికి ప్రోత్సాహం ఇవ్వబడును. వెంటనే వ్రాయండి అని వుంది.

అంటే, ఆ ప్రకటనను చూసిని నరేంద్ర ఎగిరి గంతేశాడు. వెంటనే వాళ్ళకి లెటర్‌రాసి రిప్లయ్ కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

"ఇంతకూ ఆ ప్రకటన వెయ్యించింది ఎవరో తెలుసా? సురేష్!" అడిగాడు శ్రీమంత్.

"ఎవరుసార్?" సురేష్ ఆత్రుతతో అడిగాడు.

"ఇంకెవరు! బలరావ్‌గారే, అప్పట్లో బలరావ్ సంస్థ చాలా క్రొత్తది.;..

"తరువాత సార్!" అన్నాడు సురేష్ శ్రీమంత్ కొంచెంసేపు మౌనం వహించడం చూచి...

పదిరోజుల తర్వాత అక్కడినుండి రిప్లయి వచ్చింది. పాస్‌పోర్టు సైజు ఫోటో ఒకటి, మరో రెండురకాల ఫొటోలు అర్జెంట్‌గా పంపమంటూ..

నరేంద్ర దగ్గర డబ్బులు లేవు. నేను దాచుకున్న డబ్బులు వాడికిచ్చాను. ఫోటోలు తీయించుకుని వెంటనే పంపించాడు. అప్పటినుండి రోజులు లెక్కపెడుతూ వాళ్ళనుండి జవాబు కోసం ఎదురుచూస్తూ వుండేవాడు. అలా వాడి ప్రథమ దశ ప్రారంభమైంది

ఈలోపుగా సెలవులు అయిపోయాయి. నేను పదవ తరగతిలోకి వచ్చాను. మా నరేంద్ర పదవ తరగతి సెకండ్‌క్లాస్‌లో పాసయ్యాడు. తరువాత వాడిని మా నాన్నగారు కాలేజీలో చేర్పించారు. కాలేజీలో చేరి

రెండు రోజులైందో లేదో మళ్ళీ అక్కడనుం డి ఓ బరువైన కవరు వచ్చింది మా నరేంద్రకి.

తలుపులు మూసేసి కవరు విప్పాడు. అప్పుడు నేను ఆ గదిలోనే ఉన్నాను. ఒక్కొక్క కాగితం చదివి, నాకు ఇచ్చాడు చదవమంటూ.

మొదటి కాగితంలో బలరావ్ సంస్థ ప్రారంభిస్తున్న తొలి చిత్రం తాలూకు వివరాలు ఉన్నాయి.

రెండవ దానిలో ప్రముఖ నటీనటులు దర్శకుల మధ్య బలరావ్ ఫోటోవుంది.


చివరి పేజీలో మాత్రం ఓ ఉత్తరం ఉంది.

'మీరు మా సినిమాలో నటించడానికి పంపిన ఫోటోలు అందియున్నవి. మిమ్మల్ని మేము ఎన్నికచేస్తూ సైడ్ హీరో పాత్ర నిస్తున్నాం. మీరు నటించడం పూర్తి అయ్యాక, మీకు ఇవ్వవలసిన పారితోషికం ఇస్తామని, మొదట్లో ఇవ్వమని తెలియజేస్తూ మీరు కొత్తవారు కాబట్టి ఖర్చులకోసం అయిదువం దల రూపాయలు బ్యాంక్ డ్రాఫ్ట్‌ద్వారా గాని, మనియార్డర్‌ద్వారాగాని పంపమని ఉంది. చిత్రం పూర్తయ్యాక పారితోషికంతోపాటు మీరు ఇచ్చిన ఖర్చుల సొమ్ము కూడా తిరిగి ఇచ్చేస్తామని తెలియజేయుచున్నాం...'' అం టూ కింద బలరావ్ సంతకం ఉంది.

ఆ ఉత్తరం చదివేక నా గుండె నిమిషానికి ఎన్నిసార్లు కొట్టుకుందో నాకే తెలియదు. ఒళ్ళంతా ముచ్చెమటలు పోసేసాయి. నరే ంద్ర మాత్రం దీర్ఘంగా ఆలోచిస్తూ కూర్చు న్నాడు. ఏం చెపుతాడోనని వాడివైపు చూశా ను.

''తమ్ముడూ... ఈ కాగితాలు వచ్చాయ ని, అసలు నేను సినిమా వేషం కోసం వాళ్ళకి ఉత్తరం వ్రాశానని ఎవరికి చెప్పకు'' అంటూ నాచేత ప్రమాణం చేయించుకు న్నాడు.

నాలుగు రోజులు గడిచేక ధాన్యం అమ్మిన డబ్బునుంచి మూడువందలు కాలేజీ



ఫీజు, పుస్తకాల కోసమని డబ్బు నరేంద్రకి ఇవ్వమని మా నాన్నగారు మా అమ్మకు ఇచ్చారు.

ఆ డబ్బును చూసిన దగ్గరనుండి మా నరేంద్రకు నిద్రే కరువైంది. ఎప్పుడు కాజేశాడో ఆ మూడు వందలు తీసి దాచేశాడు. ఆ సంగతి మాకెవరికీ తెలియదు. ఆ బలరావ్ అదృష్టమో, మా దురదృష్టమో మరి... ఆరోజు రాత్రే మా పక్క ఇంటిలో దొంగలు పడి దొరికినదంతా వూడ్చేశారు.

మా అమ్మ ఖంగారు పడుతూ డబ్బు ఉంచిన బీరువా దగ్గరకు వెళ్ళి చూసింది. డబ్బులేదు. డబ్బు కనిపించకపోయేసరికి మాఇంట్లోకూడా దొంగలు పడ్డారేమోనని అనుకున్నాం. డబ్బు పోయేసరికి మా అమ్మ షాక్ తింది. అసలే గుండె జబ్బు కల మనిషి. దానికితోడు మళ్ళీ ఈ షాకొకటి వచ్చి పడింది. హాస్పిటల్‌లో చేర్పించాం. నెలరోజులు గడిచిన తరువాత తిరిగి మామూలు మనిషి అయి ఇంటికి వచ్చింది. పంటమీద వచ్చిన సొమ్ము కాస్తా అలా తగలబడింది. ఈ గొడవ సద్దుమణిగిన తరువాత మా నరేంద్ర ఆ డబ్బు పంపేసినట్టున్నాడు. అక్కడినుండి మనియార్డరు తాలూకా రసీదు నా చేతికి అందింది. అదిచూసి నవ్వాలో, ఏడ్వాలో నాకు అర్థం కాలేదు. నరేంద్రకి చూపిస్తే ఖంగు తింటాడనుకున్నా... కాని, వాడికి ఆ రసీదు చూపించాక వాడు భయపడలేదు, వణికిపోలేదు.

తనే ఆ డబ్బు తీసానని ఒప్పుకున్నాడు. అంతేకాదు. పక్కఇంట్లో కూడా తానే దొంగతనం చేశానంటూ చెప్పాడు. ఈ విషయం ఇంట్లో చెప్పవద్దని బ్రతిమాలాడు. సినిమాలో నటించేక అంతకి అంత వాళ్ళింతలు ఇస్తానని శపథం చేశాడు.

కాని ఆ మాటలు నేను వినిపించుకోలేదు. మా నరేంద్ర ఊబిలో కూరుకుపోతున్నాడు. వాడిని ఎలా రక్షించాలోనని నేను ఆలోచిస్తున్నాను.

నా మౌనం చూసి "తమ్ముడూ... అవకాశమనేది మనిషికి ఒక్కసారే వస్తుంది. అప్పుడే దానిని సద్వినియోగం చేసుకోవాలి. ఒకసారి చెయ్యి జారిన తర్వాత మరోసారి అవకాశం వస్తుందనుకోవడం పొరపాటు" అంటూ ఏదో నీతి వాక్యం చెప్పాడు.

నేనేమీ మాట్లాడలేదు.

మళ్ళీ నాన్నగారు డబ్బు అప్పుచేసి ఫీజులు, పుస్తకాలకు ఇచ్చారు. అంతేకాకుండా మా అక్కయ్యకు సంబంధాలు చూడసాగారు.

చివరికి ఎలా అయితేనేమీ పదివేల కట్నం, రెండు ఎకరాల భూమి ఇస్తానంటూ పెళ్ళి ఖాయం చేసి పై నెలలో ముహూర్తం కూడా పెట్టించారు.

మరల శని మొదలైనట్టుంది. మద్రాస్ నుంచి నరేంద్రకి ఏదో కవరు వచ్చింది. ముందుగా తాము తెలియజేసినట్టు సైడ్ హీరో పాత్ర కాకుండా హీరో పాత్ర నిచ్చామని, సినిమా తియ్యడానికిగాను కొంత సొమ్ము అవసరమని, అది కట్టాలని, త్వరగా కట్టకపోతే ఆ అవకాశం మరొకరికి పోతుందని మరీ గట్టిగా వ్రాశారు.

కాని ఈ విషయం నాకు తెలియకుండా

జాగ్రత్త పడ్డాడు మా నరేంద్ర. ఆ బలరావ్ పంపిన సినీ భూతం వాడిని పట్టినట్టుంది. ఎప్పుడూ అదోరకంగా వుండే వాడు. నిద్రలోకూడా కలవరించేవాడు. ఆఖరికి ఎలా అయితేనేమి మా అక్కయ్య పెళ్ళి పదిరోజులుండనగా ఎవరికీ చెప్పా చెయ్యకుండా పెళ్ళి డబ్బు దక్కించుకుని సూట్‌కేస్‌తో మాయమయ్యాడు నరేంద్ర.

పోతూపోతూ నన్ను వెతికించడానికి ప్రయత్నం చెయ్యొద్దని, మళ్ళీ వస్తానని, ఏమీ ఖంగారు పడవద్దని ఓ లెటర్ రాసి మా మొహాన్ని వుంచి మరీపోయాడు.

మా నాన్నగారికి ఏం చెయ్యాలో పాలు పోలేదు. ముహూర్తం నాటికి కట్నం డబ్బు పెళ్ళికొడుకు చేతిలో వుంచలేకపోయాడు. డబ్బు ఇస్తేనే తాళి కడతానన్నాడు పెళ్ళికొడుకు. అప్పటికప్పుడు పదివేలు ఎవరిస్తారు? పొలం అమ్ముదామనుకుంటే అక్కయ్య ససేమిరా వద్దంది. తనకి పెళ్ళి కాలేకపోయినా ఫర్వాలేదంది. పొలం మాత్రం అమ్మవద్దని ఖండితంగా చెప్పింది.

దాంతో పెళ్ళి చెడిపోయింది. నరేంద్ర ఇంటినుంచి వెళ్ళి రెండు వారాలైంది. కనీసం ఉత్తరం కూడా వ్రాయలేదు. సినిమా ఛాన్స్ వచ్చిందేమోనని కొంత సంతోషించాను. మద్రాస్‌వెళ్ళి ఉంటాడని నేను ఎవరికి చెప్పలేదు.

అక్కయ్య పెళ్ళి అవ్వలేదని మా నాన్న, అన్నయ్య కనిపించలేదని అమ్మ దిగులు పడిపోసాగారు. అన్నిచోట్ల వెతికించారు. అందరి బంధువులతోను చెప్పారు. కాని లాభం లేకపోయింది.

ఈలోపుగా అక్కయ్యమీద ఇరుగు, పొరుగు వాళ్ళు ఏవో చాడీలు చెడుగా చెప్పుకోసాగారు. ఆ చాడీలు విన్న నేను కోపం పట్టలేక ఓ పొరుగు మనిషిని రాయి తీసుకుని సూటిగా ఆమె మొహం మీదికి విసిరేను. అది కాస్తలో తప్పింది. లేకపోతే ఆమె మొహం పచ్చడిలా అవ్వాల్సిందే. నన్ను



## జాగ్రత్త

"మీ షాపులో డిడిటి ఉందా?"

"ఉంది"

"నల్లుల మందు ఉందా?"

"ఉంది"

"టిక్ ట్వంటీ ఉందా?"

"ఉంది. ఇంతకీ నీకేం కావాలి బాబూ?" అడిగాడు షాపుయజమాని చింటూని.

"శుభ్రంగా చేతులు కడుక్కుని రెండు చాక్లెట్లివ్వండి చాలు" చెప్పాడు చింటూ.

—పులిజాల రవీంద్రరావు (వనస్థలిపురం)

కొట్టడానికి రాబోయేసరికి అక్కయ్య నన్ను లోపలికి తీసుకుని వెళ్ళిపోయింది. అంతేకాదు, నన్ను కౌగిలించుకుని వలవలా ఏడ్చేసింది. ఎలాగో సముదాయించాను.

కాని... కాని... ఆరాత్రే అక్కయ్య ఇంట్లోనుంచి వెళ్ళిపోయింది సురేష్! వెళ్ళిపోయింది..." మునిపంటితో బాధని ఆపుకుంటూ చెప్పాడు శ్రీమంత్.

అంతవరకు వూపిరి బిగపట్టి వింటున్న సురేష్ మాట్లాడలేకపోయాడు.

కొద్ది సేపటికి తేరుకున్న తరువాత "తర్వాత అక్కయ్య కనిపించారా సార్!" అడిగాడు సురేష్.

"లేదు సురేష్! కనిపించలేదు. ఇటు అక్కయ్య అటు అన్నయ్య కనిపించకపోయేసరికి అమ్మకి మెంటల్ వచ్చింది. అర్ధరాత్రి లేచి "వచ్చావురా నరేంద్ర! ఇంతవరకు ఎక్కడికి వెళ్ళావురా!" అంటూ కన్నీరు, మున్నీరుగా విలపించేది.

ఇలా... నెలరోజులు గడిచిపోయాయి.

ఒక రోజు ఉదయాన్నే ఎవరో మా ఇంటికి వచ్చి మా నాన్నగారిని హడావిడిగా తీసుకుపోయాడు. వెళ్ళేముందు ఆయన నాతో చెప్పాడు. మీ అన్నయ్య చనిపోయాడంటూ... ఆ మాట నమ్మాలో లేదో అర్థం కాలేదు నాకు. ఏదో దెయ్యం పట్టినట్టు అయింది. మట్టిముద్దలా గోడకి జారబడి కూర్చున్నాను. అలా ఎంతసేపు కూర్చున్నానో...

ఇంటిముందు రెండెడ్లబండి ఆగింది. మువ్వలచప్పుడుకి నాకు తెలివొచ్చింది. బయటకు వచ్చి చూశాను. అప్పటికే ఇంటిముందు అరుగుమీద...

ఏ అరుగుమీదయితే నవ్వుతూ, హుషారుగా నాటకాలు వేసేవాడో... ఆ అరుగుమీదే నిర్జీవంగా గడ్డిమీద పడుకుని ఉన్నాడు.... శ్రీమంత్ కళ్ళవెంట నీళ్ళు కారసాగాయి.

క్షణంసేపు ఏమీ మాట్లాడలేకపోయాడు సురేష్. ఆ తరువాత కొద్దిసేపటికి "చనిపోయాడా సార్ నరేంద్ర!" అన్నాడు బాధగా.

"అవును సురేష్! చచ్చిపోయాడు. అప్పుడే అన్నయ్య శవాన్ని చూసిన మా అమ్మకు అప్పటికప్పుడే గుండెపోటు వచ్చి వైద్య సహాయం అందేలోగా ఆమె చనిపోయింది. డాక్టర్ కోసం బయటకు వెళ్ళివచ్చిన మా నాన్న ఆ దృశ్యాన్ని చూచి గుండెపోటు వచ్చి ఆయనకూడా చనిపోయాడు.

ఏకకాలంలో అన్నయ్యని, తల్లిదండ్రుల్ని కోల్పోయి అభాగ్యునిగా మిగిలిపోయాను.

ఆరోజు సప్తసముద్రాలు ఏకమయ్యేలా ఏడ్చేను. అలా ఎంతసేపు ఏడ్చానో నాకు తెలీదు. ఎవరెవరో వస్తున్నారు. వాళ్ళు చెప్పే ఓదార్పు మాటలు నాకు వినపడటం లేదు. చివరికి వాళ్ళ దహన సంస్కారాలు 'కీ' ఇచ్చిన బొమ్మలా వాళ్ళు చెప్పినట్టు చేసి నా తల్లిదండ్రుల్ని అన్నయ్యని మట్టిచేసి ఇంటికి వచ్చాను.

ఒకేసారి ఇలాంటి దురదృష్టం పగవాడికి కూడా కలగకూడదు సురేష్!

వారం రోజులు గడిచేక నన్ను మా బాబాయి తనకూడా తీసుకుపోతానన్నాడు.

ఇంతలో మా స్కూల్ హెడ్మాస్టర్ గారు వచ్చారు. అంతా విన్నాక మా

బాబాయితో అన్నారు. ఇప్పుడు మీ కూడా తీసుకువెడితే మధ్యలో చదువు పాడవుతుంది. అంతేకాకుండా వీడు త్వరగా కోలుకోవాలన్నా మీ ఊళ్ళో కష్టం. ఇక్కడే నాతోపాటు మా ఇంట్లో ఉంటాడు. స్కూల్ వాతావరణానికి అలవాటుపడితే త్వరగా మామూలు మనిషి అవుతాడు...'' అంటూ ఒప్పించారు

మా బాబాయి 'సరే'నంటూ వెళ్ళిపోయాడు.

నాకు ఇంకా పాత జ్ఞాపకాలు గుర్తుకువస్తూనే ఉన్నాయి. ఆరోజు ఓ కవరు నాకు వచ్చింది. స్కూల్ చిరునామాకు హెడ్మాస్టర్ నాచేతికిచ్చారు.

దానిమీద ఫ్రమ్ అడ్రస్ లేదు. అది రాసింది మా నరేంద్ర. మా అన్నయ్య రాత నాకు బాగా తెలుసు. ఆత్రుతగా చింపేను. లోపల ఓ కాగితం మడతపెట్టి వుంది. విప్పాను. అది మా నరేంద్ర రాసిందే.

తమ్ముడూ...

వయసులో చిన్నవాడివైనా ఆనాడు నీవు చెప్పినట్టు వింటే నాకీ దుర్గతి పట్టివుండేది కాదేమో... సినిమాలో చేరాలని ఎంత డబ్బు తగలేశానో... ఆ డబ్బు నాన్న కష్టార్జితం... అదికాకుండా అక్క పెళ్ళికి ఉంచిన కట్నం సొమ్ము పదివేలు తీసింది నేనే తమ్ముడూ...

మద్రాసు వచ్చిన తర్వాత అడ్రస్ ప్రకారం అక్కడికి వెళ్ళాను. నన్నుచూసి చాలా మర్యాదలు చేశారు. అప్పుడే హీరోలా ఎంతో పొంగిపోయాను.

షూటింగ్ ఖర్చుల కోసం అంటూ నా దగ్గరఉన్న డబ్బునంతా తీసుకున్నారు. సినిమా పూర్తయ్యాక ఆ డబ్బుతోపాటు నటించినందుకు ఇవ్వవలసిన పారితోషికం కూడా ఇస్తామన్నారు. నిజమేననుకున్నాను. అందుకే నేను తెచ్చిన సొమ్మునంతా వాళ్ళకిచ్చేశాను. రెండురోజులు నాకు ట్రైనింగ్ ఇచ్చి, తరువాత ఓ అరగంటసేపు కెమెరా




## కొత్త

'జీనత్ అమన్' అంటే నా కెప్పుడూ గౌరవమే. ఆవిడ మంచితనం నేనెప్పటికీ మర్చిపోను అంటాడు రాజ్‌బబ్బర్.

'ఇన్సాఫ్‌కా తరాజ్' సినిమా నిర్మాణానికి ముందు రాజ్‌బబ్బర్ నిర్మాత, దర్శకుడు బి.ఆర్.చోప్రాని కలిసి వేషం ఇమ్మని అడిగాడు.

'మంచి కథవుంది నీకు వేషం ఇస్తాను... అయితే కొత్తవాడివి నీతో నటించడానికి ఎవరైనా పెద్ద హీరోయిన్ ఇష్టపడితే' అన్నాడు బి.ఆర్.చోప్రా.

''అప్పటికే పెద్ద హీరోయిన్‌గా పేరున్నా కొత్తవాడివి నాతో నటించడానికి ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు జీనత్ అమన్''.

'అది ఆవిడ గొప్ప సంస్కారానికి నిదర్శనం' అంటాడు బబ్బర్.

—వింజమూరి కృష్ణమూర్తి

ముందు నిలబెట్టి ఏవో కొన్ని షాట్స్ తీశారు. తరువాత మళ్ళీ పిలుస్తామని చెప్పి, తెల్లకాగి తాలమీద సంతకం చేయించుకున్నారు. పది, పదిహేను రోజుల్లో కబురు పంపుతామని ఇంటికి వెళ్ళిపొమ్మని చెప్పారు. అంతమాత్రానికే ఇంటికి వెళ్ళడం దేనికని... లాడ్జిలో వుంటానని చెప్పి, ఆ లాడ్జి అడ్రెస్‌కూడా ఇచ్చాను.

వాళ్ళు మాత్రం వారంరోజులు, పదిరోజులు దాటినా పిలువలేదు. అలా రెండు వారాలు ఎదురుచూస్తూ గడిపాను. ఆఖరికి నేనే వెళ్ళి కనిపించి అడిగేసరికి 'నువ్వెవరివో మాకు తెలీదు పో...' అన్నారు ఆఫీసువాళ్ళు. బలరావ్‌ని కలిస్తే నీకంటేమరో అయిదు వేలు ఎక్కువ ఇచ్చినవాడున్నాడు. అతడినే హీరోగా బుక్ చేసుకున్నాం. అయినా నీ ఫేస్ సినిమాకు పనిచెయ్యదు. నీకు ఇవ్వవలసింది చిత్రం పూర్తయ్యాక ఇస్తామని చెప్పి వెళ్ళిపోయాడు.

నాకేం చెయ్యాలో ఎవరికి చెప్పాలో మతిలేకుండా పోయింది. లాడ్జి ఖర్చులు హోటల్ ఖర్చుల నిమిత్తం చేతికి ఉన్న ఉంగరాన్ని అమ్మేశాను. ఇంటికి వచ్చేయ్యాలనుకున్నాను. కానీ ఏ మొహం పెట్టుకుని రాను. రానురాను భయం పట్టుకుంది. చివరికి చేతిలో వున్న కాస్త డబ్బుకూడా అయిపోయింది. పాండీ బజార్లో పిచ్చి ఎక్కినట్టు తిరిగాను. ఏదో ఒక పనిచేసి పొట్ట పోషించుకోవాలనుకున్నాను. పనికోసం ప్రయత్నించాను. ఆ మహానగరంలో నాకు పనిచ్చేవాడే కరువయ్యాడు. వారం రోజులు తిండిలేక, నీళ్ళతో కాలం గడిపాను. నేనే కాదు, నాలాంటి సినిమా పిచ్చి పట్టుకున్న మరికొంతమంది కూడా అంతే! రోజులు గడుస్తున్నా... నా జీవితం గడిచేదారి దొరకలేదు. ఇంటికి రావడానికి నా మనస్సు అంగీకరించలేదు. డబ్బులేక అక్కయ్య పెళ్ళి ఆగిపోతుందని తెలుసు. ఎంత తొందరపడ్డానో ఇప్పుడు అర్థమయింది.

తమ్ముడూ చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లయింది నా పరిస్థితి. చివరిసారిగా బలరావ్ దగ్గరికెళ్ళి నా దగ్గర తీసుకున్న డబ్బు ఇవ్వమని అడిగాను.

"చిత్రం పూర్తయ్యాక డబ్బు ఇస్తానంటే నువ్వు ఒప్పుకుని అగ్రిమెంట్‌మీద సంతకం చేశావు. ఏది ఏమైనా ఇంతలో అంత డబ్బు నేనెక్కడినుంచి తేను. చిత్రం పూర్తయ్యాక ఇస్తానని చెప్పానుగా..." అంటూ బైటికి గెంటించాడు బలరావ్.

ఆ రోజుతో నాకు పట్టిన సినిమా భూతం నిజంగానే ఎగిరిపోయింది తమ్ముడూ... బ్రతకడానికి దారిలేక చివరికి చావును కోరుకున్నాను. కడసారిగా మిమ్మల్ని అందరినీ చూడాలనే నా కోరిక నెరవేరలేదు. తమ్ముడూ... అమ్మా, నాన్న, అక్కయ్యని క్షమించమని చెప్పు.

ఇట్లు
నరేంద్ర

ఆ ఉత్తరం చదివేక ఎంత బాధపడ్డానో ఆ భగవంతుడికే తెలియాలి సురేష్.

నా పసి హృదయంలో ఏ మూలనుంచో పగ రేగింది. నా కుటుంబాన్ని నాశనం చేసిన ఆ బలరావ్ మీద పగ తీర్చుకోవాలని.

దాని కోసం నేను బ్రతుకుతున్నాను.

తరువాత మా హెడ్మాస్టరు చెప్పిన ప్రకారం నడుచుకుంటూ ఓ ప్రక్క నాటకాలు కూడా వేస్తూవచ్చాను. అనుకోకుండా అదే నా జీవితానికి దారి చూపింది.

అలాంటి అదృష్టం మా నరేంద్రకి లేదేమో... ప్చ్... పదవ తరగతి పరీక్షలు అయ్యాక మా హెడ్మాస్టరుగారి కూతురి పెళ్ళి విజయవాడలో జరిగింది. ఆ పెళ్ళి సందర్భంలో మమ్మల్ని నాటకం వెయ్యమని అడిగారు. అప్పుడు 'కురుక్షేత్రం' నాటకం వేశాం. అందులోనాది అర్జునుడి పాత్ర.

మాహెడ్మాస్టరుగారి అమ్మాయి పెళ్ళికి పెళ్ళికొడుకు బంధువుగా ప్రఖ్యాత దర్శకులు వర్మగారు వచ్చారు. అనుకోకుండా మేం వేసిన నాటకం చూశారు. అందులో నా నటన చూసి ముగ్ధులయ్యారు. మా హెడ్మాస్టరుగారిని ఒప్పించి ఆయన తీస్తున్న చిత్రంలో ఓ వేషం ఇచ్చారు. అదృష్టవశాత్తు దాని తరువాతే ఒకదాని తర్వాత ఒకటి అవకాశాలువచ్చాయి. ఇలాంటి అదృష్టం వచ్చినప్పుడే మనం నటించాలి. అందని దాని కోసం అర్రులు చాచకూడదు సురేష్.

అలా నా సినిమా జీవితం ప్రారంభమైంది. అప్పుడు మదన్ బిజీ నటుడిగా ఉండేవాడు. నా తర్వాత స్థానానికి నీవే అర్హుడవవుతావు అన్నారాయన. ఆ మహానటుడి మాట అక్షరాలా జరిగింది. ఆయన చనిపోయాక ఆ స్థానం నాకు లభించింది. నా జీవితానికి వెలుగుచూపిన వర్మగారికి నేను జీవితాంతం ఋణగ్రస్థుడ్ని.

ఎన్నో చిత్రాలలో నటించాను. ఎన్నో విజయవంతంగా నడిచాయి. నిర్మాత దగ్గర్నుండి ప్రేక్షకుడి వరకు ఆదరాభిమానాలు పొందాను. కాని... నాలో చెలరేగుతున్న పగని తీర్చుకోవాలనిఎదురుచూస్తున్నాను. ఇదే నా జీవితంలో ఒక అంకంగా మిగిలిపోయింది. ఎప్పుడైతే ఆ పని పూర్తి అవుతుందో అప్పుడే చిత్రరంగానికి గుడ్‌బై కొడతాను. బలరామ్ గుర్తుకు వచ్చినప్పుడల్లా నా హృదయం అగ్నిగుండంలా కణకణమండుతుంది.



టైమ్ చాలా కావస్తుంది వెళ్ళి పడుకో..."
అంటూ మంచంమీద కూలబడ్డాడు శ్రీమంత్. తన కుటుంబానికి జరిగిన అన్యాయం గురించి చెప్పుతూ...

* * *

తన రూమ్‌లోకి వచ్చాడేగానీ సురేష్‌కి నిద్రపట్టడం లేదు. ఎప్పుడూ నవ్వుతూ వుండే శ్రీమంత్ హృదయంలో ఇంత విషాదం దాగివుందా?

తనుకూడా మొదటినుండి నరేంద్రలాగే సినిమాల్లో చేరాలని మద్రాసు వచ్చాడు. తరువాత సర్వనాశనం అయిపోయాడు. తెచ్చిన డబ్బు వేషం ఇస్తానన్న నిర్మాత చేతిలో పెట్టాడు.

మెడలో గొలుసు, చేతికి ఉన్న వుంగారాలు, ఇవన్నీకరిగించి మద్రాసులో వుండి వేషం కోసం పడిగాపులు కాస్తున్నప్పటి రోజులు.

అప్పుడు ఇంట్లో చెప్పి, పెట్టె బేడా సర్దేసి డబ్బు జేబులో పెట్టుకుని హుషారుగా మద్రాసుకి బయలుదేరాడు సురేష్.

మధ్యమధ్యలో పగటికలలు కంటూ మంచి సంతోషంగా ఆనంద డోలికల్లో తేలిపోయాడు.

అదిగో అక్కడే షూటింగ్... తను నటిస్తున్నప్పుడు చూడ్డానికి వచ్చినవాళ్ళు చేసిన కేరంతలు, చప్పట్లు... షూటింగ్ అయిపోయాక ఎంతోమంది తన ఆటోగ్రాఫ్‌కోసం ఒకరిమీద ఒకరు పడటం, కొట్టుకోవడం... తను బాగుగా నటించినందుకు అభిమాన సంఘాలు వారు చేస్తున్న సన్మానంలో ఠీవిగా కూర్చుని ఉండటం ఎందరో హీరోయిన్ల సరసన నటించడం... కాల్‌షీట్ల కోసం నిర్మాతలు ఇంటిముందు క్యూలో ఉండటం, రెండుసార్లు బెర్తుమీద నుండి కిందికి పడబోయి ఎలాగో తమాయించుకుని పగటి కలలు కనేస్తున్నాడు సురేష్.

ఎప్పుడు మద్రాసు వెడతానా... ఎప్పుడు సినిమాలో నటిస్తానా అని ఒకటే ఇదైపోయాడు.

ఎలా అయితేనేమి మద్రాసు స్టేషన్‌లో దిగాడు. కాళ్ళు ఒకచోట ఆగడం లేదు. నేరుగా టాక్సీస్టాండ్‌కి పోయి అడ్రెస్ ప్రకారం వెళ్ళాడక్కడికి.

తనవెంట కొన్నివందలు తీసుకువెళ్ళిన సురేష్ వారం రోజుల్లో సర్వం కోల్పోయిన బికారిలా తయారయ్యాడు. వేషం ఇస్తానని నిర్మాత, వేషం ఇప్పిస్తానని దర్శకుడు చెరిసగం గుంజేశారు. ఆకలిబాధ తీర్చుకోవడం కోసం ఒకదాని తరువాత ఒకటి అమ్మేశాడు. చివరికి ఇంటికి వెళ్ళడానికి డబ్బుల్లేక స్టేషన్‌లో తన స్టేటస్ మరచిపోయి అడుక్కుంటూ మరో వారం గడిపాడు. అప్పుడే ఏదో పనివుండి శ్రీమంత్ స్టేషన్‌కి వచ్చాడు. సురేష్‌ని చూసి ఆశ్చర్యపోయాడు. ఇంతకుమందు నిర్మాతలదగ్గర దర్శకుల దగ్గర కూర్చుని నవ్వుతూ కబుర్లు చెప్పేవాడు. అంతలో ఇలా ఎలా తయారయ్యాడు చెప్మా... అనుకుంటూ తనకూడా రమ్మని చెప్పి హోటల్‌కి తీసుకుని వెళ్ళాడు శ్రీమంత్.

తన గోడంతా వెళ్ళబోసుకున్నాడు. కరువుతీరా కన్నీరు కార్చేడు. ఇలాంటి పనులు ఎప్పుడు చెయ్యను బాబోయ్ అం

టూ ఏడ్చాడు. అమ్మ, నాన్నల దగ్గరనుంచి తెచ్చిన సొమ్మంతా ఖర్చయిపోయిందని తను బ్రతకడానికి ఓదారి చూపమని కాళ్ళు పట్టుకుని మరీ బ్రతిమాలాడు సురేష్. ఓ ఫ్యాక్టరీలో ఉద్యోగం ఇప్పించాడు శ్రీమంత్.

అలా... అలా... సురేష్‌లోని మంచిని గుర్తించి తన సెక్రటరీగా ఉంచుకున్నాడు శ్రీమంత్.


శ్రీమంత్ ఎక్కువ డబ్బుని ఇచ్చినా సురేష్ తీసుకునేవాడు కాదు, రోజులు గడిచేకొద్దీ ఇంతకుముందు తను భుక్తికోసం అమ్మేసిన వస్తువులను తిరిగి సంపాదించుకున్నాడు. అప్పుడు కాని మామూలు మనిషి కాలేకపోయాడు సురేష్. శ్రీమంత్ కాని ఆదుకోకపోతే ఈపాటికి తను దిక్కులేని చావు చచ్చేవాడేమో... ఆ భగవంతుడే శ్రీమంత్ రూపంలో వచ్చి ఆదుకున్నాడేమో... ఏమైనాసరే శ్రీమంత్ రుణం తను ఎప్పటికీ తీర్చుకోలేడు.

ఇప్పటివరకు కూడా సినిమాలో చేరాలని వచ్చినవాళ్ళు తప్పటడుగులు వేస్తుంటే ముందుగానే వాళ్ళనో దారిలో వుంచేవాడు. ఫీలైతే వెంటనే వాళ్ళని ఇటికి పంపే ఏర్పాటు చేసేవాడు. ఇలాఎంతమందిని ఆదుకున్నాడో, తనకే తెలీదు. ఎంతమందికి తన పరపతిని ఉపయోగించి జీవనోపాధిని కల్పించాడో... అతనికే తెలీదు. ఇతరులకు ఇంత ఉపకారం చేస్తూ ఎప్పుడూ నవ్వుతూ వుండే శ్రీమంత్ గుండెల్లో ఇంత అగ్నిపర్వతం దాగివుందా?

భగవాన్! శ్రీమంత్ తన ప్రతిజ్ఞ నెరవేర్చుకునేటట్టు చెయ్యి, దుర్మార్గుడైన బలరావ్‌కు గుణపాఠం నేర్పు... మనసులోనే దేవుడిని ప్రార్థించాడు సురేష్.

"సార్! బలరావ్ మళ్ళీ ఫోన్ చేశాడు" అంటూ రిసీవరు శ్రీమంత్ చేతికిచ్చాడు సురేష్.

"వాడి పాపం పండి, బద్దలయ్యే దశకు వచ్చింది" కసిగా రిసీవర్ చేతిలోకి తీసుకు



భలే

ఎస్ఐ ఉద్యోగానికి ఇంటర్వ్యూ జరుగుతోంది—

"నువ్వెప్పుడైనా అరెస్టయ్యావా?" అడిగాడు పోలీస్ అధికారి ఇంటర్వ్యూకి వచ్చిన కన్నారావ్‌ని

"లేదు..."

"ఎందుకని?"

"భలేవారే! నేనంత తేలిగ్గా ఎలా దొరికిపోతానండీ?!"

—పి.సునీల్ (పెద్ద కొట్టాల)

న్నాడు.

"హల్లో... శ్రీమంత్ స్పీకింగ్..."

"హలో... నేను బలరావ్‌ని... షూటింగ్‌కి బయలుదేరుతున్నారా?"

"ఆ... అవును..."

"థాంక్స్! త్వరగా రండి" రిసీవరు పెట్టేశాడు బలరావ్.

తొమ్మిదింటికి సర్కార్ స్టూడియోకి చేరుకున్నాడు శ్రీమంత్. ఇప్పుడు తను నటిస్తున్న చిత్రానికి కథకుడు, నిర్మాత, దర్శకుడు బలరామే.

"చూడు శ్రీమంత్! ఈ పిక్చర్‌ని ఇంతకుముందు ఎవ్వరూ తియ్యని రీతిలో తీస్తున్నాను. ఎఫెక్టు కోసం నకిలీవి కాకుండా ఒరిజినల్స్ పెడుతున్నాను. ఇదిగో మొదటి షాట్‌గా ఈ గ్లాజు పలకలో వుండే వస్తువుమీద తీస్తున్నాం. ఇది హాలీవుడ్ నుంచి రప్పించాను. దీని ఖరీదు ఎంతో తెలుసా? ముప్పై లక్షలు. రోజూ అద్దె లక్ష రూపాయలు..." చెప్పాడు బలరావ్.

"ఐసీ అలాగ..." అన్నాడు శ్రీమంత్. ఆ గాజుపలకలో వుండే వస్తువును క్రీగంట చూస్తూ.

ఇప్పుడు నువ్వు దొంగల నాయకుడితో పోరాడే సీను తీస్తున్నాను. ఆ నాయుకుడు లెదర్ సూట్‌కేస్‌ని సూటిగా దానిమీద విసురుతాడు. అది పడకముందే నువ్వు ఎగిరి పట్టుకోవాలి. దానికి డూప్ అనవసరం. ఈ చిన్న పని నువ్వే చేయాలి. ఏమంటావు?" అన్నాడు బలరావ్ శ్రీమంత్‌తో.

"అలాగే..." అంటూ తలూపాడు శ్రీమంత్.

ఓకే లైట్సాన్, స్టార్ట్ కెమెరా...

పోట్లాట ప్రారంభమయింది.

"ఇన్‌స్పెక్టర్! ఇలాంటి అమూల్యమైన వస్తువు వుంటే మా దేశంలోనే ఉండాలి. ఇంకెక్కడా ఉండకూడదు. అందుకే దీన్ని కూడా తీసుకువెళ్ళబోతున్నాను..." గెడ్డం సవరించుకుంటూ అన్నాడు ఆ దొంగల నాయకుడు.

"అది ఈ ఇన్‌స్పెక్టర్ విజయ్ బతికివుండగా దానిని తీసుకెళ్ళలేవు. నీలాంటి దేశద్రోహులకు ఎలాంటి గుణపాఠం నేర్పాలో నాకు తెలుసు. అండర్‌స్టాండ్..

"ఇన్‌స్పెక్టర్ ఈ షోలా చేసే పనులకి అడ్డం వస్తే ఫలితం ఎలా వుంటుందో చెప్పనవసరం లేదనుకుంటా..." అన్నాడు కళ్ళు ఎర్రచేస్తూ.

"ఒరేయ్ షోలా! నువ్వు కళ్ళెర్ర చేసిచూస్తే భయపడి పారిపోవడానికి నేనేం పిరికిపందను కాదురా! బేవకూఫ్., పులిని..." అంటూ ఓ కిక్ ఇచ్చాడు విజయ్.

నేలకొట్టిన బంతిలా నుంచున్నాడు షోలా.

విసురుగా పొట్టలో గుద్దేడు విజయ్‌ని. కిందపడ్డాడు విజయ్., మిగతా షోలా అనుచరులు కదలకుండా గట్టిగా పట్టుకున్నారు విజయ్‌ని.

"విజయ్ దీన్ని తీసుకువెళ్ళడం నాకు ఇష్టం లేదు. అందుకే నాశనం చేస్తున్నాను... అంటూ చేతిలోని లెదర్ సూట్‌కేస్‌ని సూటిగా దానిమీద విసిరేడు.

ఒక్క జంప్‌తో ఆ సూట్‌కేస్‌ని పట్టుకోవాలి. కాని కావాలనే ఆలస్యంచేశాడు.

అంతే అది టప్‌మంటూ పగిలిపోయింది

స్టూడియోలో గందరగోళం బయలుదేరింది. అగ్రిమెంటు ప్రకారం ప్రమాదంలో గాయపడినా లేక ప్రాణాలు పోగొట్టుకున్నా అది నిర్మాతకి ఏవిధమైన బాధ్యత ఉండదు. అలాగే ప్రమాదంలో పోయిన వస్తువులకు హీరో, విలన్‌లు బాధ్యులు కారు. నకిలీదైతే ఫర్వాలేదు. ఎఫెక్టుకోసం తెచ్చింది మరి. వాళ్ళ ఒప్పంద ప్రకారం నిర్మాతే ఆ డబ్బు చెల్లించాలి.

ఫలితంగా ముప్పై లక్షల రూపాయలు నష్టపరిహారంగా ఇచ్చుకున్నాడు బలరామ్.

ఎఫెక్టు సరిగా లేకపోవడంవల్ల సీను సరిగా రాలేదు. ఎలాగో ఆ సీను అయిందనిపించాడు.

ఆ చిత్రం మొత్తంమీద పూర్తిచేశాడు. రశలోపుగా ల్యాబ్‌కు పంపే నిమిత్తం నిల్వచేయబడిన ఫిల్మ్‌లో అయిదు రీళ్ళఫిల్మ్‌ను ఎక్స్‌పోజ్ చేయించాడు శ్రీమంత్ ఎవరికీ తెలియకుండా. భారీ సెట్టింగులతో బడాబడా తారలతో చిత్రీకరించబడిన ఆ అయిదు రీళ్ళు ఎందుకూ పనికిరాకుండా పోయింది. ఆ కారణంగా విపరీతమైన నష్టాల ఊబిలో మెడవరకు కూరుకుపోయాడు బలరామ్.

కసిగా నవ్వుకున్నాడు శ్రీమంత్.

మొత్తంమీద క్రిందా మీదా పడి ఎలాగోలా డబ్బును సంపాదించి తిరిగి ఆ అయిదు రీళ్ళను రీషూట్ చేయించాడు.

చిత్రం విడుదల చేయడంలో మరో అవరోధం వచ్చిపడింది. ఏ తారీకున ఆ చిత్రం రిలీజవుతుందో సరిగ్గా ఆ తారీకునే మరో డిస్ట్రిబ్యూషన్ వాళ్ళు మరో చిత్రాన్ని వదలుతున్నారు.

రెండు చిత్రాలు శ్రీమంత్ నటించినవే.

రెండవ చిత్రాన్ని శ్రీమంత్ సెక్రటరీ సురేష్ తీశాడని తెలిసి ఎలాగో దానిని మరో వారంలో విడుదల చేయించవచ్చునని నేరుగా సురేష్ దగ్గరికి పసిగట్టుకుని మరీ



## భవిష్యత్తు

నేను కాలేజీ రోజుల్లోనే రాజకీయాల్లో అడుగు పెట్టాను. హిందీ భాషను పెట్టాలన్న ఉద్యమంలో పాల్గొని (జైల్ భరో) ఢిల్లీ లోకల్ జైల్లో ఓ రోజు గడిపాను.

ఫిల్మ్ ఇండస్ట్రీలో జూనియర్ ఆర్టిస్టుల వేతనాల పెంపు కోసం. వాళ్ళ పట్ల ప్రవర్తిస్తోన్న తీరుకు వ్యతిరేకంగా స్మితాపాటిల్‌తో కలిసి పనిచేశాను.

దేశంలో కాంగ్రెస్—ఐ విధానాలు, రాజీవ్ గాంధీ తీరు నచ్చక నా ఫిల్మ్ కారియర్‌ని కూడా వదులుకుని వి.పి.సింగ్‌తో కలిసి జాతీయ రాజకీయాల్లోకూడా పాలుపంచుకున్నాను.

నాకు మంచి అనుభవం రాజకీయ భవిష్యత్తు ఉంది అంటున్నాడు రాజ్ బబ్బర్.

—వింజమూరి కృష్ణమూర్తి

వెళ్ళాడు బలరామ్.

"ఏమిటి సురేష్! నువ్వు నిర్మాతగా ఎప్పుడు మారావు. నా కెప్పుడూ చెప్పలేదే.. ." అన్నాడు బలరామ్ ఈర్ష్యగా.

"అలా అంటారేమిటండి. ఇదివరకు ఎన్నో చిత్రాలకు సహ నిర్మాతగా వున్నాను గా. ఇప్పుడు నాకు నేనే నిర్మాతగా మారిపో యాను. ఇందులో ఆశ్చర్యపడవలసిన పనే ముంది?" మెత్తగా చురక తగిలించాడు సురేష్.

అదిసరేగాని, నా చిత్రం విడుదల అవుతున్న రోజునే నీ చిత్రంకూడా వస్తుంది . రెండింటిలోను హీరో ఒక్కడే. అదో ఇదో తన్నేస్తుంది. అందుకని నీ చిత్రం డేట్ మార్చు" అన్నాడు బలరామ్ నెమ్మదిగా.

"ఏమిటీ! డేట్ మార్చాలా... అవతల పంపిణీ సంస్థ వాళ్ళు ఉరేసుకుంటారు. వాల్ పోస్టర్ల ప్రింటింగ్ అంతా పూర్తయిపో యింది. మధ్యలో కేన్సిల్ చేసుకుంటే ఎంత నష్టమొస్తుందో నాకే తెలీదు. కావాలంటే నీ చిత్రం మరో నెలలో వదులుకో..." అన్నాడు సురేష్.

"నీ చిత్రంలో బోడి గొప్ప ఏముందని.. . చూడ్డానికి... నాదాంట్లో ఎన్నో వున్నాయి. నా చిత్రం ముందు నీ చిత్రం బలాదూర్ అవుతుంది. వయసులో చిన్నవాడివి. నీకేం తెలుసు నా మాట విను..." చెప్పాడు బలరామ్ కోపంగా.

"ఇలాంటి పరిస్థితిలో ఒకరి మాట వినే ఓపిక నాకు లేదు. నాకేం తోస్తే అదే చేస్తాను. నా నిర్ణయాన్ని ఆ దేవుడు కూడా మార్చలేడు. మీకు చేతనైతే మీరే చేసుకోండి" అన్నాడు విసురుగా సురేష్.

"అలాగే చేసుకుంటాను. తరువాత తీరుబడిగా ఏడుద్దువుగాని..." పళ్ళు నూరు కుంటూ వెళ్ళిపోయాడు బలరామ్.

రెండు చిత్రాలు విడుదలయ్యాయి.

విడుదలైన నాలుగోరోజుకే ఒక్కొక్క దబ్బా బలరామ్‌కి చేరుకోసాగింది.

ఉత్తరాలు టెలిగ్రామ్‌లు, టెలిఫోన్లు కుప్పలు తెప్పలుగా వచ్చిపడసాగాయి.

అన్నింటిలోను ఒకటే మాట 'ఇలాంటి చెత్త చిత్రాన్ని తియ్యడంలో మీ ఉద్దేశ్యమేమి టి' అంటూ.

శ్రీమంత్‌కి కూడా చాలా ఉత్తరాలు వచ్చాయి. మీరు నటించిన రెండు చిత్రాల్లో ఒకటి సూపర్ హిట్ మరొకటి సూపర్ బో ర్. ఇలాంటి చిత్రంలో నటించడానికి ఎందుకు ఒప్పుకున్నారు" అంటూ లక్షలాది అభిమానులు ఉత్తరాలు రాశారు.

సురేష్ చిత్రానికి మంచి పేరు వచ్చింది . అంతేకాదు కలెక్షన్స్‌కూడా బంపర్.

"సారీ ఎఫెక్టు లేకపోవడంవల్ల మన తెలుగువారికి ఇలాంటి కొత్త కొత్త రుచులు అలవాటులేని కారణంగా మీ చిత్రం దెబ్బతి ంది. తమిళంలోకి డబ్‌చేసే బాగుగా ఆడవ చ్చు. వాళ్ళ టేస్ట్‌కు సరిపోతుంది ఈ సబ్జెక్టు" అంటూ సలహా ఇచ్చాడు శ్రీమం త్.

డబ్బుకోసం గడ్డి తినే మనుష్యులకి ఇదో లెక్కా... వెంటనే డబ్బింగ్ కార్యక్రమం ప్రారంభించి కొద్ది రోజులకే పూర్తిచేసేశాడు బలరామ్.

తలని తన్నేవాడొకడైతే, తాడిని తన్నేవా

దొకదు అయినట్టు తమిళంలో కూడా ఘోర పరాజయం పొందింది బలరావ్ చిత్రం.

దానితో మొట్టమొదటిసారిగా డీలా పడిపోయాడు బలరావ్.

వారం రోజుల తర్వాత స్టూడియోలో అగ్నిప్రమాందం జరిగి స్టూడియోలో వుంచిన ఫిలిం బాక్సులు బూడిదగా మారిపోయాయి.

గోరుచుట్టుపై రోకటిపోటన్నట్లు హఠాత్‌గా ఇన్‌కంటాక్స్ వాళ్ళు దాడిచేశారు. దొంగ లెక్కలు చూపించి పన్నుఎగవేశాడన్న నేరం రుజువైంది. ఫలితంగా ఉన్న ఆస్తికూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.

ఇలాంటి స్థితిలోనే భయంకరమైన వ్యాధి కేన్సర్ బయటపడింది. ఏడుకొండలమీద వెంకటేశ్వరుడిలా వెలిగే బలరావ్ ఈరోజు బురదలో పొర్లుతున్న పందిలా రోగంతో హాస్పిటల్ లో మూలుగుతున్నాడు.

పరామర్శకి వచ్చారంతా. తలోరకంగా చెప్పుకున్నారు బలరావ్ పరిస్థితి చూసి.

'అంతా వెళ్ళిపోయాక శ్రీమంత్ వచ్చాడు.

"శ్రీమంత్! ఏం పాపం చేశావని నాకీ శిక్ష పడింది" ఆవేదనగా అన్నాడు బలరావ్ శ్రీమంత్ మొహంలోకి చూస్తూ.

"బలరావ్! నువ్వు ఏ పాపం చెయ్యలేదా ... ఓసారి నువ్వు గతంలో చేసిన దుర్మార్గపు పనులు గుర్తుకు తెచ్చుకో..." ఆవేశంగా అన్నాడు శ్రీమంత్.

"ఏమిటీ! దుర్మార్గపు పనులా! నేనా!" ఆశ్చర్యపోతూ అడిగాడు బలరావ్..?

"అవును బలరావ్! నువ్వే నువ్వు నటీనటులు కావాలని ప్రకటనలు చేసి వచ్చినవాళ్ళ దగ్గరనుండి వేలకు వేలు డబ్బు గుంజి, మోసంచేసి మేడలు మిద్దెలు కట్టుకున్నావు అవునా?"

బలరావ్ ఏమీ మాట్లాడలేకపోయాడు.

ఇంతవరకు నువ్వు సంపాదించిన సొమ్ము



ంతా అన్యాయంగా సంపాదించిందే. ఒక్క పైసాకూడా నీ కష్టార్జితం కాదు. నటీనటులు కావాలని ప్రకటించి వాళ్ళనుండి డబ్బుగుంజి, ఆశలు కల్పించి, చివరికి వేషం ఇవ్వకుండా కల్లబొల్లి కబుర్లు చెప్పి రేపు, మాపు అంటూ త్రిప్పించేవాడివి. నువ్వు వేషం ఇస్తావని, వాళ్ళు ఇళ్ళకు వెళ్ళకుండా లాడ్జిలో వుండి, హోటల్‌లో తింటూ వేషం కోసం ఎదురుచూస్తూ మొత్తం ఆర్పుకుని ఇంటికి వెళ్ళడానికి డబ్బుల్లేక రోడ్లవెంట తిరుగుతుంటే వాళ్ళ డబ్బుని మింగి హాయిగా ఎయిర్ కండిషన్డ్ కార్లలో తిరిగేవాడివే.. ఆ పాపం ఊరికేపోతుందా బలరామ్..." కోపంగా అన్నాడు శ్రీమంత్.

"శ్రీమంత్!" అన్నాడు బలరామ్ బాధగా మూలుగుతూ.

"బలరామ్! నువ్వు చేసిన పనికి నా కుటుంబం సర్వనాశనం అయిపోయింది. వేషం ఇస్తానని మా అన్నయ్యని నమ్మించి మోసం చేసి వేలకు వేలు గుంజావు. సినిమా వేషానికి ఆశపడి మా అక్కయ్య పెళ్ళికి వుంచిన కట్నం సొమ్ముకూడా నీకే అర్పించాడు. అయినా నీ ధన దాహం తీరలేదు. వాడికి వేషం ఇవ్వలేదు. నీ మోసాన్ని గ్రహించి మావాడు డబ్బు అడిగేసరికి బయటకు గెంటించావు. చేసిన పాపం తేలిగ్గా ఒదిలిపోతుందా బలరామ్..." పిడికిలి బిగించి చెప్పాడు శ్రీమంత్.

"శ్రీమంత్ ఏమిటి నువ్వు చెప్పేది...'

గతాన్ని మరిచిపోయి అడిగాడు బలరామ్.

"ఇంకా అర్థం కాలేదా రాస్కెల్! ఇదిగో ఈ ఫోటో ఎవరిదో తెలుసా? అంటూ జేబులోనుంచి ఓ ఫోటో తీసి చూపించాడు శ్రీమంత్.

"ఉహూ... గుర్తులేదు" తల అడ్డంగా ఊపేడు బలరామ్. "అవును! నీలాంటివాళ్ళకి ఎలా గుర్తువుంటుంది. ఈ కాగితాలు చూడు, ఎవరు రాసినవంటావు" చూపించాడు శ్రీమంత్.

"నేనే..." అంటూ మూలిగేడు బలరామ్.

"ఎందుకు రాశావ్!" కళ్ళల్లో అగ్నికణాలు రాలిపడేటట్టు కోపంగా అడిగాడు శ్రీమంత్.

మాట్లాడవే! రాసింది డబ్బు కోసమేగా ? అందుకే నీకీ శిక్ష విధించాడు భగవంతుడు మరో మాట క్రిందటి నెలలో విడుదలైన నీ చిత్రం పరాజయం కావడానికి కారణం ఎవరో తెలుసా, నేనే! స్టూడియోలో అగ్నిప్రమాదం సృష్టించి నీ ఫిల్మ్ రీల్స్‌ను తగులబెట్టించింది, ఇన్‌కమ్‌టాక్స్‌వాళ్ళ దాడి చేయించింది, అయిదు రీళ్ళ ఫిల్మ్ఎందుకు పనికిరాకుండా ఎక్స్‌పోజ్ చెయ్యించింది, హాలీవుడ్‌నుండి రప్పించిన గాజు పలకపోవడానికి, నీ చిత్రానికి పోటీగా సురేష్ చిత్రం వదలడానికి కారణం నేనే. ఈ దెబ్బతో నీ పాపం పండింది బలరామ్..." కసిగా నవ్వేడు శ్రీమంత్.

"శ్రీమంత్ నమ్మించి ఇంత ద్రోహం చేస్తావా? కోపంతో ఊగిపోతూ అన్నాడు బలరామ్.

"ద్రోహమా! నేనా? భలే విచిత్రంగా మాట్లాడుతున్నావు బలరామ్. అయినా

నువ్వు చేసిన ద్రోహం ముందు నేను చేసింది ఎంత?'' వెటకారం ధ్వనించేటట్టు అన్నాడు శ్రీమంత్.

''కేసు పెడతాను...'' ఆవేశంగా అన్నాడు బలరామ్.

''ఏమని?'' ప్రశాంతంగా అడిగాడు శ్రీమంత్.

''నాకు జరిగిన నష్టాలకు కారకుడివి నువ్వని...''

''హ్హా...హ్హా... బలరామ్! ఒక్కటిమాత్రం గుర్తుంచుకో. ఇప్పుడు నీ గతి ఎలా వుందో తెలుసా? రోడ్డుమీద అడుక్కుతినే ముష్టివాడికన్నా హీనంగా ఉంది. అయినా నువ్వు నామీద కేసుపెడితే నీకు పిచ్చి ఎక్కిందని పిచ్చి హాస్పిటల్‌లో జాయిన్ చేసేస్తారు జాగ్రత్త!

ఇంకో విషయం! నేను చిత్రరంగంలోకి వచ్చింది నటించడానికి కాదు, పగ తీర్చుకోవడానికి. అది ఏనాటినుంచో ఎదురుచూస్తూవున్నాను. ఈనాటితో నా పగ చల్లారింది. అంతమందిని మోసం చేసినందుకు క్రుళ్ళి, క్రుళ్ళి చావు. నీ చావు నీలా ఎందరినో మోసం చేసిన వాళ్ళందరికి కనువిప్పు కావాలి. నేను ఒప్పుకున్న చిత్రాలు నిన్నటితో పూర్తయ్యాయి. ఇక చిత్రరంగానికి రేపటితో గుడ్‌బై కొడుతున్నా... వస్తా... బలరామ్ వస్తా...'' అంటూ కసితీరా నవ్వుతూ బయటకు వచ్చేశాడు శ్రీమంత్.


* * *

''సార్! వెళ్ళిపోతున్నారా?''

''అవును సురేష్! నేను సినీ ఫీల్డుకి ఎందుకైతే వచ్చానో ఆ పని నెరవేరింది. ఇక చేసేదేమీ లేదు. మా ఊరు వెళ్ళిపోతున్నాను. మరో జీవితాన్ని ప్రారంభిస్తాను...'' చెప్పాడు శ్రీమంత్.

''నేనుకూడా మీతో వచ్చేస్తాను సార్!'' బాధతో అన్నాడు సురేష్.

''వద్దు సురేష్! వద్దు... నీకు నిర్మాతగా మంచి భవిష్యత్ ఉంది. దానిని పాడుచేసుకో



వద్దు. నువ్వు ఇక్కడే వుండిపో. మన కంపెనీ బిజినెస్ నీ పేర మార్చాను. ఉన్న ఆస్తిలో సగం కూడా తీసుకువెడుతున్నాను. మిగతా సగం అనాథ శరణాలయాలకు ఇచ్చాను. సినీఫీల్డులోకి వచ్చి నిరాశ, నిస్పృహలతో కుమిలిపోతున్న వాళ్ళకి ధైర్యం చెప్పు. వారిని పైకి తీసుకురావడానికి ప్రయత్నించు. ఇంత కన్నా నేనేం కోరడం లేదు. నీకు ఈ జీవితంమీద విరక్తి పుట్టినప్పుడు ఐ మీన్ సినీ జీవితంమీద... నాదగ్గరికి వచ్చేయి....'' వెన్నుతట్టేడు శ్రీమంత్.

* * *

మద్రాస్ రైల్వేప్లాట్‌ఫారంమీద ఇసుకవేస్తే రాలనంత జనం.

స్నేహితులు, శ్రేయోభిలాషులు, నిర్మాతలు, దర్శకులు, కథకులు ఒక్కరేమిటి... మొత్తం సినీఫీల్డు అంతా కదిలి వచ్చేసింది అక్కడికి.

హఠాత్తుగా ఎవరికి చెప్పా చెయ్యకుండా ఇలాంటి నిశ్చయానికి వచ్చినందుకు సినీ పరిశ్రమ యావత్తు దిగ్భ్రాంతి చెందింది. ఎంతో బిజీ నటుడు, ఎన్నో హిట్ చిత్రాల కథానాయకుడు... ఇటువంటి నిర్ణయానికి వచ్చాడంటే ఎవ్వరు నమ్మలేకపోతున్నారు. కళ్ళతో స్వయంగా తిలకించాలని హుటాహుటిగా అంతా స్టేషన్‌కి చేరుకున్నారు.

అక్కడ శ్రీమంత్‌ని చూడగానే నిజమే అనుకున్నారంతా. పత్రికా విలేకరులకు నాలుగు ముక్కల్లో చెప్పాడు శ్రీమంత్.

''నాకు నేనే సినీ పరిశ్రమనుంచి తప్పుకుంటున్నాను. ఇందుకు ఫలానా కారణమంటూ లేదు. సినీ పరిశ్రమ నాకు తల్లివంటిది. అలాంటి తల్లికి దూరమవుతుంటే ఎంతో బాధగా వుంది. కాని నాలాంటి నటులు ఇంకా చాలామంది ఉన్నారు. వాళ్ళంతా పైకిరావాలి. వాళ్ళ శ్రేయోభివృద్ధి కోసం నేను కావాలని తప్పుకోవడం లేదు. ఇంతవరకు నా జీవితంలో సగభాగం సినీ పరిశ్రమలోనే గడిపాను. మిగిలిన జీవితాన్ని మరో కొత్త జీవితంగా ప్రారంభించబోతున్నాను. అందుకే సినీ ఫీల్డ్‌కే గుడ్‌బై కొడుతున్నాను....'' అంటూ ముగించాడు శ్రీమంత్.

''శ్రీమంత్ వెళ్ళిపోతున్నావా? ఆశ్చర్యంగా అడిగాడు డైరెక్టర్ వర్మ.

అవుట్‌డోర్ షూటింగ్‌కని ఆయన హాలెండ్ వెళ్ళివచ్చారు. ఈ లోపుగా శ్రీమంత్ సినీరంగ నిష్క్రమణ వార్త గాలికన్నా వేగంగా ఆయన్ని చేరింది. అంతే, క్షణంకూడా ఆలస్యం చెయ్యకుండా స్టేషన్‌కి వూడిపడ్డారు.

''అవునండి వర్మగారు! మీ మనసుకి బాధ కలిగిస్తే క్షమించండి'' ఆ మాట అనేసరికి కళ్ళవెంట నీరు పొంగింది శ్రీమంత్‌కి.

''క్షమించడానికి ఏముందోయి... నీ నిర్ణయానికి నువ్వు వచ్చావు. ఒకరి పనుల్లో తలదూర్చేపని చెయ్యడం నా ఇష్టానికి వ్యతిరేకం. వాత్సల్యంగా భుజం తట్టేరు వర్మగారు.

''వర్మగారు! నా జీవితానికి ఓ దారి చూపడమే కాకుండా నా లక్ష్యానికి గమ్యం ఏర్పరిచారు. అందుకు మీకు ఎల్లకాలం రుణపడివుంటాను'' అంటూ వంగి కాళ్ళకు

నమస్కరించాడు శ్రీమంత్.

"చూడు శ్రీమంత్ నాదేమీ లేదు. అగతా నీ కృషి పట్టుదల..." అంటూ పైకి లేవనెత్తారు వర్మగారు.

బండి బయలుదేరడానికి సిగ్నల్ ఇచ్చారు

"సురేష్! వస్తా! ఉత్తరాలు రాస్తూవుండు ఏమైనా అవసరం వస్తే నేనున్నానని మాత్రం మరిచిపోకు..." కౌగిలించుకుని కళ్లనీళ్ళు తుడుచుకుంటూ రైలుఎక్కేడు శ్రీమంత్.

"గయ్! మంటూ అరచి మెల్లగా బండి ముందుకు కదులుతుంటే శ్రీమంత్ మనసు బాధతో బరువెక్కింది.

ప్లాట్‌ఫారం కనిపించేటంతటి వరకూ చెయ్యి ఊపి మెల్లగా వచ్చి సీట్లో కూర్చున్నాడు శ్రీమంత్.

అతనిప్పుడు వెళ్లేది షూటింగ్‌కి కాదు, మరో ప్రశాంతమైన జీవితాన్ని ప్రారంభించడానికి.

*

